# పరివర్తనం

రచన :
శ్రీరామదాసు భాస్కర్రావు

సాయంసమయము. సూర్యకాంతి సన్నగిల్లి చంద్రకాంతి ప్రజ్వరిల్లినది. వాతావరణం చల్లబడింది. వేడిగాలులు తగ్గి చల్లటి మలయమారుతం బయలుదేరింది. తేనెమంచు మెల్లగా ఆ లేతవెన్నెలలో దిగజారుచుండగా ఆప్రాంతపు వాతావరణంలోని కొక నూతన వెలుగు వచ్చింది!

అంతటి ప్రకృతిశోభలోకూడ నిర్మానుష్యం కాదని నిరూపించటానికే 'వాసు' అలా ఆలోచిస్తూ కూర్చున్నాడు. నీలిరంగు ఆకాశం వైపొకసారి చూసేడు. కళకళలాడుతున్న నెలరాజును వెంటనే మూసేసింది ఆమాయదారి మేఘం. చిలిపిగా నవ్వుకున్నాడు తనలో. ప్రకృతి అంతా చీకటైంది. ఇక తన జీవితంకూడ ఇంతేకదా! తన మధుర భాషిని, మత్తకోకిల, పంకజవల్లి ఇంకా ఎన్నో పేర్లు సృష్టించుకున్నాడు తన 'భాగ్యాన్ని'. ఆ భాగ్యమే తనను మసిచేసిపోయింది. నవీన పద్ధతుల ననుసరించి తగినంత స్వేచ్ఛనిచ్చాడు సమాజంలో తిరగడానికి. అదే! ఆ స్వేచ్ఛే కొంపముంచింది. కాకపోతే, తనకన్నా ఏ పరిస్థితులలో మధు ఘనుడు? వట్టి పోకిరి, లేనిపోని అలంకారాలన్నీ తగిలించుకొని అమ్మాయిల్ని వశంచేసుకోడానికి ప్రయత్నాలు తప్ప వాడిలో ఏదీ గొప్ప విషయం లేదు. పాపం! అగ్నిసాక్షిగా పెండ్లిచేసుకున్న భార్యను కూడ అన్యాయం చేసిపోయాడు. అయినా దీనికైనా బుద్ధి వుండక్కర్లేదూ? తనకు ప్రాణసమానుడైన భర్త వుండగా వేరేవాడితో లేచిపోవడమా! దీనికి వాడి భార్యమీదనైనా జాలి కలగలేదేమో! పాపిష్టిది! ఇప్పుడు పాపం! ఆ రఘుగాడి భార్య సంగతేమిటి? అందుకే గాబోలు పెద్దలంటారు. స్త్రీకిస్త్రీయే పరమ శత్రువని. అయితే తనకిప్పుడు దారిఏమిటి? మళ్లీ పెండ్లిచేసుకోవాలా, ఛీ! మరింక జన్మలో ఆ మాటెత్తకూడదు. తను భాగ్యాన్ని పెండ్లి చేసుకొని ఏమి సుఖం పొందాడు? అవును. తనకు ఉద్యోగరీత్యా ఒక్కక్షణంకూడ తీరుబడివుండేదికాదు గడచిన సంవత్సరమంతా. అయినా అప్పుడప్పుడు అంటూవుండేవాడు. "భాగ్యం! కొత్తగా పెండ్లిచేసుకున్నాననైనా మా మేనేజరుకి దయలేదు సుమా! ఎప్పుడు పడితే అప్పుడు తనతో నెలలుపాటు క్యాంపులకు తీసుకుపోతున్నాడు. ఈ నెల పోతే నాకింక అంతాతీరుబడే! పనేవుండదు. అప్పుడు మనం హాయిగా ఉండొచ్చు ఏం?" అని. దానికి సమాధానంగా ఒక్కచిఱునవ్వుమాత్రం నవ్వేది భాగ్యం. తను ఊర్లో లేనప్పుడు మహిళాసంఘ వార్షికోత్సవాలలో పాల్గొంటూ కాలక్షేపంచేస్తుందనుకున్నాడు గాని ఇలా ఆ పోకిరీ వెధవతో సంబంధాలుపెట్టుకొని ఇంత పని చేస్తుందని తను కలలోనైనా అనుకున్నాడా? తను తెల్లవారితే ఏ ముఖంపెట్టుకుని నలుగురిలో తిరగగలడు? ఏనోటవిన్నా అదేమాట. ఫలానా వాసుగారిభార్య ఫలానా వాడితో లేచిపోయింది. ఛీ! అంతకన్నా ఘోర నరకం యింకేమైనా వుందా? అయితే ఏమి చేయాలి! ఆత్మహత్య. అమ్మో! అది మహాపాపం. అయినా తను మగవాడు. తనకేం! గడించుకుంటున్నాడు. హాయిగా స్వేచ్ఛగా బ్రతకగలడు. ఎవరేమనుకుంటే తనకేం! బ్రతికినంతకాలం ఒంటరిగానే ఏ చీకు చింతా లేకుండా బ్రతకవచ్చు. కాని వెధవదలా వుండలేముకదా! ఈపాడు యవ్వనం వుందే అది మహా చెడ్డది. దిగజారిపోయిన ఆశల్ని మళ్లీ రేకెత్తిస్తుంది. అవును నిజమే! అందుకే తను భాగ్యాన్ని పెండ్లిచేసుకున్నది. ధర్మపత్నిగా వుంటుందనుకున్నాడు. గృహిణిగా ఆదర్శవంతురాలవుతుందనుకున్నాడు. కాని తను ఇంటలేనివేళలో ఆ ఎదురింటి మధుతో స్నేహం యేర్పర్చుకుంటుందని తనకేం తెలుసు? ఛీ! ఎంత ఆశలు రేకెత్తితేమట్టుకు నీతినియమాలు పాపపుణ్యాలు ఆలోచించకుండా అంత నీచానికి దిగజారిపోవడమే!

సరే! జరిగిపోయిందేదో జరిగిపోయింది. తనకింక భాగ్యం లేకపోవడంతో 'నా' అన్న వాళ్లెవరూ లేకుండాపోయారు. తను ఒకానొకప్పుడు భాగ్యాన్ని చూసి ఎన్నో కలలు కన్నాడు. ఆమె తనకు సహచరిణిగా వుంటే స్వర్గసుఖంపొందొచ్చనుకున్నాడు. కాని అవేమీ ఆలోచించకుండా కొంచెమైనా ఇంగితజ్ఞానం లేకుండా వాడితో లేచిపోయింది. ఇక తను రేపట్నుంచి ఎలా బ్రతకడం?"....ఇలా ఆలోచిస్తూ మబ్బులచాటున మునుగుతూ తేలుతూన్న చందమామను చూస్తూ కొంతరాత్రి గడిపేడు.

ప్రకృతి ఆనందదాయిని. ప్రపంచపరిస్థితులతో దానికి సంబంధంలేదు. ఎవరెన్ని బాధలతోవున్నా దానికి బాధలేదు. తనుమట్టుకు ఎల్లప్పుడూ ఉల్లాసంగానేవుంటుంది. మేఘాలు కొంచెం దిగజారేయి. చంద్రుడు ఇప్పుడు ఏ అడ్డంకులు లేకుండా తన చల్లని కిరణాలను అందరికీ అందచేస్తున్నాడు. అలా పూర్తిగా అందుకున్నవాడిలో వాసుకూడ ఒకడు. అలా ఒక్క నిముషం తేరిపార చూసేడు. కళ్ళు మసకలు కమ్మినట్లనిపించింది. ఏదో మానవ శరీరం ఒకటి కొమ్మలచాటునుండిపోతుంది. కండ్లు కొంచెం పెద్దవిచేసి చూశాడావైపు, ఆశ్చర్యం! అది ఒక అందమైన స్త్రీవిగ్రహం. అది ఇంతరాత్రివేళ రావడం, ఆశ్చర్యంతోపాటు, స్త్రీ కోసం వేదనపడుతున్న తనకు ఆనందాన్నికూడ కల్గించింది. ఎంతో చక్కగా సింగారించుకుంది. బహు వయ్యారంగా నడుస్తుంది. ఆమెకట్టిన సిల్కుచీర ఆ పాల వెన్నెలలో ఎంతో అందంగా మెరుస్తుంది. చంద్రుడు ఆమెతో సరసము లాడుచున్నట్లుగా ఆమె ఎత్తయిన వక్షస్థలంమీద తన అమృతకిరణాలను వెదజల్లుచున్నాడు. సెలయేరువంటి సన్నని నడుము, అతి సున్నితమైన దేహము, తీక్షణమైన నయనదృష్టి. ముద్దుగొలిపే ముఖం, నవ్వితే సిల్లులుపడే బుగ్గలు! గండుతుమ్మెదలవంటి కనుబొమ్మలు పంకజాలాంటి నేత్రాలకు నూతన శోభనిస్తున్నాయి. ఆమెను అలా చూస్తూనేయున్నాడు వాసు. ఆమె తనవైపే వస్తున్నట్లుంది. వాసు దేహమంతా ఒక్కసారి గగుర్పాటుచెందింది. పండువెన్నెలలో మెరిసిపోతున్న వెన్నలాంటి ఆమె నూతన యవ్వనం ఎవరి కారాధనమో! చిరునవ్వులతో చిందులుత్రొక్కే ఆ లేత మృదువైన చెక్కిళ్ళు ఎవరికంకితమో! లేత గులాబీరెక్కల్లాంటి పెదవులమధ్య బంగారపు ముత్యములవలె మెరిసిపోతున్న ఆ దంత రాజ్యములు ఎవరికి పూజనీయమో!

ఇలా ఆలోచిస్తున్న వాసు మరి ఆగలేకపోయాడు. మెల్లగా లేచి ఆమె వెనుకనే నిలబడ్డాడు. రాకను గమనించి ఆగిందా సుందర విగ్రహం. మాట్లాడలేదు. పలుకరించేడు కాని పలుకలేదు. బయలుదేరబోయింది. కాని మెల్లగా నాపేడు. ఆగింది కాని తలైనా ఇటు

తిప్పలేదు. వాసు హృదయం ఆశతో విప్పారింది. నూతన స్వర్గంలోనికి ప్రవేశించబోతున్నట్లుగా మదనపడ్డాడు. మృదువుగా ఆమెను తాకాడు. అతి మృదువుగా ఆమె రెండు బుజాలు పట్టుకున్నాడు. అంతలోనే దూరముగా ఒక కోకిల తియ్యని కంఠంతో పాడుతూంది. తుమ్మెద రెక్కల్లా మిలమిలా మెరిసిపోతున్నాయి ఆమె శిరోజాలు వెన్నెలలో! పైకుబకనిసిగ్గుతో మెల్లగా అతనివైపొకసారిచూసి వెంటనే ముఖం దించేసుకుంది. నభామండపమువలె శిరోజాలపై యేర్పర్చిన మల్లెదండలు అతనిని మత్తెక్కించాయి. ఒక్కసారిగా ఆ సుందరాంగిముఖం తనవైపు తిప్పుకున్నాడు. కాని అంతలోనే ఆ పాపిష్టిమేఘం వెన్నెల నడ్డేసింది! చల్లని పిల్లగాలొకటి మెల్లగా వారిద్దరిమధ్యా వీచిపోయింది. వాయుదేవు సకర్పిత మొనరించునట్లుగా తమ పరిమళాన్ని వెదజల్లాయి ఆమెజడలోని మల్లెలు. వెంటనే ఆమెను గట్టిగా కౌగలించుకొని తనివితీరా ముద్దులవర్షం కురిపించేడు. ఆ ఆలింగనములో అతనికి స్పర్శద్వారా "అర్కంది వాయిలు జాకెట్టులో అజ్ఞాతవానం చేస్తున్నాం సుమా!" అని ఆమె వక్షద్వయం చెప్పినట్లనిపించింది! వెంటనే ఆ అజ్ఞాతవాసం విడిపించాడు. వాటి గగుర్పాటు తగ్గించేడు. ఆమె మారు మాట్లాడకుండా అతనిని పెనవేసుకుపోయింది. అర్ధరాత్రి చల్లని చలిగాలికీ వొణికిపోతున్న లేతనైన ఆమె పెదాలను తన పెదవులతో సంబాలించాడు. గాలికి రెపరెపకొట్టుకుంటున్న ఆ లేతగులాబీరంగుచీర పొగరును అరిగట్టేడు. అంతే మారుమాట లేకుండా లొంగిపోయిందతనికి. మృదువైన దేహసౌందర్యము, యవ్వనము తన కర్పించునట్లుగా ఆమె అతని బాహువుల్లో చిక్కిపోయింది. వీళ్ల జోలి మనకెందుకన్నట్లుగా ఓ కొండమూలకు పోయాడా వెన్నెలరాజు! తను జీవితంలో యెప్పుడూ పొందని స్వర్గసౌఖ్యం అనుభవించాడు.

రాత్రి మూడు గంటలయింది. చీకూ చింతా లేకుండా ధైర్యంగా చిరునవ్వుతో నిద్రపోతున్నదామె వాసుప్రక్కలో. ఆమెను చూడగానే మత్తుగా ఒక్కసారి గతుక్కుపడ్డాడు! చీ! ఇప్పుడు తనెంత తప్పుపనిజేసాడు? ఎవరో పరాయిస్త్రీని అనుభవించేడు. తన భాగ్యం చేసినపనికన్నా ఇది క్షమించదగినదా? కాదు. ముమ్మాటికీ కాదు. తను చాల పాపాత్ముడు. అన్నెమూ పున్నెమెరుగని పరాయిస్త్రీని అనుభవించాడు. ఇది నిజంగా తన భాగ్యానికి అన్యాయంచేయడమే అవుతుంది. తన మనసు పరిపరివిధాలుగా పోతుంది! "భాగ్యం! అని గట్టిగా అరిచాడు పిచ్చివాడిలా తనకు తెలియకుండానే! తుళ్లిపడి లేచిందామె, కళ్లునులుపుకుంటూ ఊడిపోయిన జాకెట్టుగుండీలుపెట్టుకుంటూ "ఎవరండీ ఆ భాగ్యం?" అంది లేతగా. ఒక్కసారిగా ఆమెనుచూశాడు. నిద్రమత్తులోకూడ తారాజివ్వలాగ మెరిసిపోతుందామె ముద్దులముఖం. గులాబీ రేకుల్లాంటి ఆమె పెదవుల్ని మళ్లీ ఒకసారి ముద్దుపెట్టుకొని చెప్పాడు. "అదా! నాభార్య! సిగ్గు, లజ్జా విడచి పరాయి మగవాడితో లేచిపోయింది."

పకపకా నవ్విందామె!

వాసుకు వళ్లంతా జెర్రులు ప్రాకినట్లయిందామె నవ్వు.

ఎందుకలా నవ్వుతావ్? అన్నాడు ఆమెను పట్టుకుని.



"మరి మీరిప్పుడు చేసిన ఘనకార్యమో?" అంది అతనికి మరింత దగ్గిరగా వస్తూ. తన వీపు ఎవరో చరిచినట్లయింది. ఏమీ సమాధానం యివ్వలేకపోతున్నాడు. ఆమెమట్టుకు నవ్వుతూనేయుంది!

"మరి నే నెవరో తెలుసా?" అంది అతని బుజాలు పట్టుకొని.

"తెలీదు"

"ఎవరో తెలియకుండా, అనుభవించడానికెక్కడనించి వచ్చిందండి మీకు ధైర్యం?"

"నీ మౌనమే నా ధైర్యానికాకారణం"

"అలాంటి ధైర్యమే మీ భాగ్యానికి కల్గిందేమో?"

"చీ! ఇంక దాని మాటెత్తకు నాదగ్గిర. దానికీ నాకూ ఇంక ఋణం తీరిపోయింది"

"నిజంగానా!" అంది అతని తలలోనికి తన మృదువైన వ్రేళ్లను దూరుస్తు.

"ముమ్మాటికి నిజం" అన్నాడు ఆమె వ్రేళ్లను ముద్దుపెట్టుకుంటూ.

"ఇంతకూ నేనెవరో తెలియలేదన్నమాట?"

"మీ ధర్మపత్ని ఏ దుర్మార్గుడి వెంట లేచిపోయిందో, ఆయనగారి అసలైన భార్యను" అంది నవ్వుతూ. ఒక్కసారి తుళుక్కుపడ్డాడు! కొంతసేపటివరకూ నోటంట మాటరాలేదు. కాని వెంటనే సంబాళించుకొని, ఆమెను గట్టిగా కౌగలించుకొని "భగవత్కృప" అన్నాడు.

"ఏం?" అందామె మృదువుగా.

"నే నిప్పుడు నా కర్తవ్యాన్ని నెరవేర్చుకున్నాను" అన్నాడు.

"మరి నా కర్తవ్యం ఏమిటండి" అంది నలిగిపోయిన చీరను సరిచేసుకుంటూ.

"నెరవేర్చావుగా మరి లే!" అన్నాడు మెల్లగా ఆమెను లేవదీస్తూ.

చల్లటి గుడ్డివెన్నెల వారిద్దరిమీదా పడుతుంది. సన్నని పొగమంచులో నూతన జీవనోపాధికై అలా పోయాయి ఆ రెండు జీవులూనూ. ఎంతవరకు వెళ్తారో వారికే తెలియదు. ★